
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సర్వజన ఘోష

- కర్నూలు జీజీహెచ్‌లో రోగుల అవస్థలు
- క్యూలైన్లలో గంటల తరబడి పడిగాపులు
- అల్ట్రాసౌండ్ పరీక్షలు అందక ఇబ్బందులు
- గర్భిణులు, వృద్ధుల తిప్పలు



ఓపీ శాంపిల్స్ కలెక్షన్ వద్ద బారులుదీరిన రోగులు

కర్నూలు హాస్పిటల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకే తలమానికంగా ఉన్న కర్నూలు సర్వజన ఆసుపత్రిలో రోగుల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి పరీక్షల కోసం వచ్చిన రోగులు, వారి సహాయకులకు నిజంగానే పరీక్ష ఎదురవుతోంది. ఓపీ మొదలుకుని న్యూడయోగ్నస్టిక్ పరీక్షల వరకు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడలేక రోగులు, వారి తరఫు బంధువులు ఆసుపత్రిలోనే నేలపై పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మంగళవారం న్యూడయోగ్నస్టిక్ పరీక్షల కోసం ఉదయం 10 గంటలకే రోగులు బారులుదీరారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పులతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఓపీ రోగుల సంఖ్య పెరిగింది. ఓపీ కేంద్రాల్లో వైద్యులు పరీక్షించి అవసరమైతే టెస్టులను రాసిస్తున్నారు. దీంతో ఆ చీటీలను పట్టుకుని రోగులు న్యూడయోగ్నస్టిక్‌కు పరుగులు తీస్తున్నారు. సోమవారం ఓపీ, ఐపీ రోగులకు కలిపి 12,300 పరీక్షలు నిర్వహించగా.. మంగళవారం కూడా అదే సంఖ్యలో పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం 12:45 గంటలైనా ఓపీ శాంపిల్స్ కేంద్రాల వద్ద ముఖ్యంగా మహిళలు, గర్భిణులు క్యూలైన్లలో నిలబడ్డారు. మంగళవారం సాయంత్రం వరకు ఉన్న గణాంకాల ప్రకారం కర్నూలు ఆసుపత్రికి 2,200 మంది ఓపీ రోగులు వచ్చారు. ఇందులో 160 మంది అడ్మిషన్ అయ్యారు.

అల్ట్రాసౌండ్ పరీక్షకు 200 టోకెన్లు

న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు ప్రతిరోజు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం ఓపీ రోగులు, మహిళలు, గర్భిణులు వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి రోగులు, గర్భిణులు వస్తుంటారు. ఉదయం 10 గంటల నుంచి క్యూలైన్‌లో నిలబడితే గానీ, టోకెన్ దొరకడం లేదు. ఉదయం 200 టోకెన్లు మాత్రమే పంపిణీ చేస్తారు. మంగళవారం దాదాపు 300 మంది రోగులు వచ్చారు. దీంతో మిగిలిన 100 మందికి టోకెన్లు నిరాకరించడంతో రోగులు వెనుదిరిగారు. మరికొంత మంది మధ్యాహ్నం 2 గంటల తర్వాత చేస్తామనడంతో అక్కడే ఉండిపోయారు. గర్భిణులు, ఓపీ రోగుల కోసం స్కానింగ్ కేంద్రాలను పెంచాలని వారు కోరుతున్నారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లోని మధ్యాహ్నం 12గంటలకే బ్లడ్ టెస్టు రిజిస్ట్రేషన్ కౌంటర్ బంద్ అయింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న స్టూడెంట్స్ కేంద్రం నుంచి బయటికి వెళ్లిపోయారు. దీంతో రోగులు రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద పడిగాపులు కాశారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదని రోగులు తెలిపారు.

స్కానింగ్ కోసం వేచి చూస్తున్న రోగులు



నీరసించిపోతున్న గర్భిణులు

వైద్య పరీక్షల కోసం వస్తున్న గర్భిణులు నీరసించిపోతున్నారు. కడుపులో బిడ్డను నవమాసాలు మోస్తున్న గర్భిణులు ఓపీ శాంపిల్స్ కలెక్షన్ సెంటర్ వద్ద సాధారణ రోగులతో క్యూలైన్లలో నిలబడలేక నరకయాతన అనుభవిస్తున్నారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులకు గైనిక్ విభాగంలోనే నిర్ధారణ పరీక్షలు, అల్ట్రాసౌండ్ పరీక్షలను అధికారులు ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. గైనిక్ ఓపీ నుంచి అంతదూరం నడిచి వస్తే ఇక్కడ కూడా క్యూలైన్లలో నిలబడలేక పోతున్నామని వారు వాపోతున్నారు. ఇక స్కానింగ్ రూముల వద్ద పరీక్ష కోసం గర్భిణులకు ప్రయాస తప్పడం లేదు.



సిబ్బంది లేని బ్లడ్ టెస్టు రిజిస్ట్రేషన్ కౌంటర్



టెస్టింగ్ కోసం మహిళల క్యూ

గర్భిణులకు ప్రత్యేక కౌంటర్లు పెట్టాలి



ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం 200 మందికి మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి క్యూలైన్‌లో ఉంటేగానీ టోకన్ దొరకడం లేదు. మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి క్యూలైన్‌లో నిలబడాలి. దీని వల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గర్భిణులు, గైనిక్ విభాగం నుంచి పరీక్షల కోసం ఇంత దూరం రావాలంటే కష్టంగా ఉంటుంది. ప్రత్యేక కౌంటర్‌ను వారి కోసం ఏర్పాటు చేయాలి.

- పీటీ సాయిప్రదీప్, హెచ్‌డీఎస్ సభ్యులు

గర్భిణులకు చాలా కష్టం



గర్భిణులకు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో పరీక్షలు చేయించుకోవడం చాలా కష్టంగా ఉంది. దాదాపు 60 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చాను. వైద్యులు పరీక్షలు రాసి ఇవ్వగా, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు వచ్చాను. సాధారణ రోగులతో క్యూలైన్లలో నిలబటం కష్టంగా ఉంది. గైనిక్ విభాగంలోనే స్కానింగ్, నిర్ధారణ పరీక్షలు చేసేలా అధికారులు ఏర్పాటు చేస్తే గర్భిణులకు మేలు జరుగుతుంది.

- హరిత, గర్భిణి, కోటకొండ, దేవనకొండ మండలం

స్కానింగ్ రక్త పరీక్ష కేంద్రాలను పెంచాలి



తొమ్మిది జిల్లాల నుంచి కర్నూలు జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు అనుకూలంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాలను పెంచాలి. ప్రతిరోజు 2వేల నుంచి 3వేల మంది రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. స్కానింగ్ కోసం 150 నుంచి 200 మంది నిరీక్షిస్తుంటారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోగులకు టోకెన్లు ఇవ్వాలి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత రిపోర్టులు ఇస్తున్నారు. 2 గంటలకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- నగేష్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

- నిర్దేశిత గడువు లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలి
- పురోగతి చూపకపోతే కఠినచర్యలు తప్పవు
- కలెక్టర్ రంజిత్ బాషా
- నీటి కుంటల నిర్మాణంపై అసంతృప్తి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా ఇళ్ల నిర్మాణాల్లో జీరో పనితీరు కనబరిచిన 185 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా హౌసింగ్ పీడీని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, యోగాంధ్ర క్యాంపెయిన్, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జిల్లాలో జూన్ 12 నాటికి నిర్దేశించిన లక్ష్యం 11,706 ఇళ్లకు గానూ 6486 ఇళ్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా 52.20శాతం ఇళ్లను పూర్తిచేయాల్సి ఉందన్నారు. నిర్దేశిత గడువులోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, పురోగతి చూపకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

తనిఖీలు చేయాలని ఆదేశం

వచ్చేనెల నుంచి రేషన్‌కు సంబంధించి తహసీల్దార్లు, ఆర్డీవోలు, సీఎస్‌డీటీలు ఏఎస్‌వోను ప్రతినెల తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారానికి 4 సర్వీసుల చొప్పున నెలకు 16 ప్రభుత్వ సర్వీసుల మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారన్నారు. పెన్షన్, అన్న క్యాంటీన్, రేషన్, దీపం పథకం-2, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలు తదితర అంశాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారన్నారు.

జూన్ చివరి నాటికి...

జిల్లాలో 8,500 నీటికుంటలను జూన్ చివరి నాటికి నిర్మించాలని లక్ష్యం కాగా, ఇందులో కూడా ప్రగతి లేదని, 1619 మాత్రమే పూర్తయ్యాయని, 2696 గ్రౌండింగ్ అయ్యాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటివరకు 7,277 శాంక్షన్లు మాత్రమే తీసుకున్నారని, కోడుమూరు, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, గోనెగండ్ల, మంత్రాలయం, కర్నూలు, కౌతాళం మండలాలు మంజూరు తీసుకోవడంలో కూడా వెనుకబడి ఉన్నారని, వీరికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలో 361 మిగులు సీట్లు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 361 సీట్లు ఖాళీగా ఉన్నాయని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపులో 73 సీట్లు, ఎంపీసీ విభాగంలో 191 సీట్లు, ఎంఈసీ గ్రూపులో 18 సీట్లు, ఒకేషనల్ కోర్సు ఏఎస్‌టీ, సీఎస్ఈ, ఎంఎల్‌టీ, పీఎస్‌టీటీ గ్రూపుల్లో మొత్తం కలిసి 79 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీట్లను రాష్ట్ర సమగ్ర శిక్ష ఎస్‌పీడీ ద్వారానే భర్తీ చేస్తారనీ డీఈవో సూచించారు. త్వరలోనే మిగులు సీట్లను భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు.

విద్యుత్ ఏడీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

- రవికాంత్ భార్య లాకర్‌లో 2.825 కేజీల బంగారు ఆభరణాలు
- స్వాధీనం చేసుకున్న అధికారులు
- వీటి విలువ సుమారు రూ.2.8కోట్లు ఉంటుందని అంచనా
- రైతునగరంలో సుమారు రూ.3కోట్ల విలువైన ఇళ్లు



స్వాధీనం చేసుకున్న బంగారం



సోదాల్లో పాల్గొన్న ఏసీబీ అధికారులు

నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతునగరంలో నివసిస్తున్న విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల రుద్రవరం మండలం చిన్నకంబలూరులో ఆళ్లగడ్డ విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈనెల 16వ తేదీ లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విద్యుత్ ఏడీఈ రవికాంత్‌చౌదరి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీన ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. అదేరోజు రైతు నగరంలోని రవికాంత్‌చౌదరి ఇంట్లో సోదాలు చేసి విలువైన పత్రాలు, ఎల్ఐసీ బాండ్లు, ఎఫ్‌డీలు స్వాధీనం చేసుకున్నారు. ఆయన భార్య ఆరోజు ఊర్లో లేరు. దీంతో మంగళవారం వచ్చారన్న సమాచారం మేరకు సోదాలు చేసి ఆమెను విచారించారు. ఆమె పేరు మీద ఓపబ్లిక్ సెక్టార్ బ్యాంకులో లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. అక్కడ సోదాలు చేసి 2.825 కేజీల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వజ్రాలతో పొదిగిన హారం ఉండడం విశేషం. 41 రకాల బంగారు ఆభరణాలు ఉండగా వీటి విలువ రూ.2.8కోట్లు ఉంటుందని ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు. రైతు నగరంలోని ఇళ్లు సుమారుగా 4.4 స్క్వైయర్ ఫీట్‌ల్లో ఉందని, వాటి విలువ సమారుగా రూ.2నుంచి 3కోట్లు ఉంటుందని అన్నారు. ఇంకా విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఈ సోదాల్లో సీఐలు కృష్ణయ్య, శ్రీనివాసులు, సిబ్బంది దొరబాబు, విశ్వనాథ్, రాముడు, పరుశురాముడు పాల్గొన్నారు.

రెండో రోజు పది సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రెండోరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 603 మంది నమోదు చేసుకున్నారు. 207 మంది పరీక్షకు హాజరు కాగా, 396 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షకు 280 విద్యార్థులు నమోదు చేసుకోగా, 258 మంది పరీక్షకు హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు 152 మందికి గానూ 127 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ నాలుగు పరీక్ష కేంద్రాలను, సహాయ కమిషనర్ 3, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 20 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు

మంత్రాలయం, మే 20 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతిఆచార్ తెలిపారు. మంగళవారం 28 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ. 3,79,10,455 నగదుతో పాటు 1,830 గ్రాముల వెండి, 74 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈనగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమచేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవికులకర్ణి, కృష్ణమూర్తి, గోపి, కరణం రాఘవేంద్ర, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ తదితరులు పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

అమృత్‌ధార ఏదీ?

- పట్టణ వాసులకు తీరని తాగునీటి కష్టాలు
- నేటికీ శివారు కాలనీలకు ట్యాంకర్లతో నీళ్లు
- అతీగతి లేకుండా ఆగిన పథకం
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన గత వైసీపీ ప్రభుత్వం
- డీపీఆర్‌కే పరిమితం
- కూటమి ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా?



కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. కర్నూలు, నంద్యాల, ఆదోని మున్సిపాలిటీలను అమృత్ 2.0 కింద ఎంపిక చేశారు. ఆయా పట్టణాల్లో పనులు చేపట్టడానికి 2023వ సంవత్సరంలో పనులకు పచ్చజెండా ఊపింది. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వ నిధులను ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవడంలో నాటి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మేధావులు చెబుతున్నారు. కనీసం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందించ లేకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు. రూ.438.12 కోట్ల విలువైన ప్రాజెక్టు అతీగతి లేకుండా ఆగిపోయింది. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి వెంటనే డీపీఆర్‌లు సిద్ధంచేసి పనులు వేగవంతం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నగర శివారు కాలనీల్లో...

నగర పరిధిలో రూ.130 కోట్లతో పనులు ప్రతిపాదించారు. శివారు కాలనీలకు నేటికీ ట్యాంకర్లతోనే నీటి సరఫరా జరుగుతుంది. కల్లూరు పరిధిలో 16 వార్డుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. జగన్నాథగట్టు వద్ద 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కర్నూలు, కల్లూరు ప్రాంతాల్లో నీటి నిల్వ చేసుకునేందుకు 20 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలి. మూడు నియోజకవర్గాలకు సంబంధించి విలీనమైన మామిదాలపాడు, మునగాలపాడు, లక్ష్మీపురం తదితర గ్రామాలతో పాటు వార్డులకు తాగునీటి సరఫరా కల్పించాల్సి ఉంది. విలీన గ్రామాలు, వార్డులను కలిపితే ఒక్కపూటకి 130 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సిన చోట 95 ఎంఎల్‌డీ మాత్రమే చేస్తున్నారు. దీంతో నగరపాలక పరిధిలో నీటి కష్టాలు తొలగడం లేదు. ప్రస్తుతం అమృత్2.0 పథకంతోనైనా తాగునీటి కష్టాలు తీరాలంటే కూటమి ప్రభుత్వం డీపీఆర్‌లు పంపించాలని ప్రజలు కోరుతున్నారు. నగరపాలికతో పాటు ఆదోని, నంద్యాల మున్సిపాలిటీల్లో కూడా ఇంకా డీపీఆర్ దశలోనే ఉన్నాయి. 2025-2026 సంవత్సరానికి ఈ పథకాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

- నంద్యాలలో రూ.174.52 కోట్లతో ఐదు పనులు ప్రతిపాదించారు. 37.22 కి.మీ. మూడు రకాల పైప్‌లైన్ నిర్మాణం, 12.50 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర పనులు చేపట్టాలన్నారు. శివారు కాలనీల పరిస్థితి నీటి సమస్యతో దయనీయ స్థితిలో ఉన్నాయి.
- ఆదోని పట్టణానికి రూ.133.60కోట్లు విలువైన ఆరు పనులతో ప్రణాళికలు రూపొందించారు. శివారు కాలనీలలో తాగునీటి ఇబ్బందులు వేదిస్తున్నాయి. కొన్ని పనులు మధ్యలో ఆపేశారు.

పరిపాలన అనుమతులొచ్చాయి..



అమృత్ 2.0 పథకానికి సంబంధించి నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. ఇటీవల ప్రభుత్వం నుంచి డీపీఆర్‌కు సంబంధించి సవరించిన పరిపాలన అనుమతులొచ్చాయి. ప్రస్తుతం నగర పరిధిలో 30 ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. ఈ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ఇవ్వాలంటే మరో 20 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించాం. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి అవుతుంది.

ఎస్.రవీంద్రబాబు, నగర పాలక కమిషనర్, కర్నూలు





ఎల్లో ట్రీ

మండు వేసవిలో పసుపు వర్ణ పూలతో కనిపిస్తున్న ఈ వృక్షం మంత్రాలయంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఉంది. ఎంతో అందంగా ఉన్న ఈ చెట్టు మొత్తం ఇలా పసుపు రంగు పూలతోనే కనిపిస్తోంది. అక్కడక్కడా కొన్ని ఆకులు తప్ప చెట్టంతా పసుపుమయమైంది. ప్రతి ఏటా ఏప్రిల్, మే మాసంలో చెట్టు ఆకులు మొత్తం రాలిపోయి ఇలా పసుపు రంగు పుష్పాలతో మాత్రమే కనిపించడం ఈ చెట్టు ప్రత్యేకత. ఏడాదికోసారి మాత్రమే ఈ చెట్టు ఇలా దర్శనమిస్తుందని సుశీల్ ప్లాస్టిక్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీ యజమాని శివాజీ తెలిపారు. ఈ ఎల్లో ట్రీ ఎదుట యువత ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- మంత్రాలయం (ఆంధ్రజ్యోతి)

ఆర్డీఎస్‌కు జలకళ



ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృతంగా దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

ప్రతి ఏటా మే నెలలో తుంగభద్ర నది నీరు లేక రాళ్లు, రప్పలతో దర్శనమిచ్చేది. ఈ ఏడాది ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో తాజాగా తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. కోసిగి మండలంలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట నిండుకుండలా కనిపిస్తోంది. దీంతో నదితీర గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రకు వరదతో ఆర్డీఎస్ ఆనకట్ట నీటితో కళకళలాడుతోంది. ఈ ఏడాది తుంగభద్ర నదిలో వేసవిలోనే వరద రావడంతో సమీప ఆయకట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

- కోసిగి (ఆంధ్రజ్యోతి)

ఎవరికోసం..?



నగరంలో ఎండ తీవ్రత ఎక్కువైంది. ఈ క్రమంలో ప్రయాణికులు ఎండల బారిన పడకుండా ప్రధాన కూడళ్లు.. బస్‌స్టాప్‌ల వద్ద చలువ పందిళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే అవి ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగపడం లేదు. ప్రైవేట్ వాహనాలకు రక్షణగా నిలుస్తున్నాయి. నిజమైన ప్రయాణికులేమో ఎండలో తిప్పలు పడుతున్నారు. నగరంలోని సి.క్యాంపు రైతు బజార్ పక్కన ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద వాహనాలను వాటి యజమానులు ఇలా పార్కింగ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు నిత్యం అటువైపుగా వస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మొత్తానికి అధికారులు ఏర్పాటు చేసిన ఈ చలువ పందిళ్లు ప్రయాణికులకు ఏమోకానీ వాహనాలకు మాత్రం పూర్తి సౌకర్యంగా నిలుస్తున్నాయి.



- కర్నూలు న్యూసిటీ (ఆంధ్రజ్యోతి)

విజయవాడకు విమానం

- జూలై 2 నుంచి సర్వీసులు ప్రారంభం
- కర్నూలు నుంచి వారంలో మూడు రోజులు



కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లావాసులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుభవార్త అందించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కర్నూలు - విజయవాడ విమాన సర్వీసులు కొనసాగించేం దుకు ముహూర్తం నిర్ణయించారు. జూలై 2న కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లే తొలి విమానం కర్నూలు (ఓర్వకల్లు) ఎగరనుంది. వారంలో మూడు రోజులు ఈ సర్వీసులు నడపనున్నారు. కర్నూలు నుంచి విజయవాడ వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు, రైల్వే రవాణా సౌకర్యం ఉంది. సుమారు 500 కిలోమీటర్లు దూరం ఉంది. 8 గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించినా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాజధాని అమరావతికి విమానాయాన సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ-3.0 ప్రభుత్వంలో కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రిగా కింజారపు రామోహ్మన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడం, మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందించారు. ఎన్నో ఏళ్ల స్వప్నం సాకారం కాబోతుండడంతో ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కర్నూలు విమానాశ్రయం నుంచి విజయవాడ సహా విశాఖపట్నం, బెంగ ళూరు, చెన్నై, షిర్డీ. ప్రధాన పట్టణాలకు విమాన సర్వీసులు నడపాలని మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తదితరులు సీఎం చంద్రబాబు, కేంద్ర విమాన యాన శాఖ మంత్రి కింజారపు రామోహ్మన్ నాయుడుల దృష్టికి తీసుకె ళ్లారు. ఆయన హామీ ఇచ్చిన వారం రోజుల్లోపే విమాన సర్వీస్‌ను నడపనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారంలో మూడు రోజులు

కర్నూలు నుంచి విజయవాడకు సోమ, బుధ, శుక్రవారం వారంలో మూడు రోజులు విమాన సర్వీసులు నడిపేలా షెడ్యూలు ఖరారు చేశారు. ఈ విమానం విజయవాడ ఎయిర్‌పోర్టులో మధ్యాహ్నం 3:45 గంటలకు బయల్దేరి కర్నూలు విమానాశ్రయానికి 4:50 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా తిరుగుప్రయాణంలో సాయంత్రం 5:10 గంటలకు బయల్దేరి 6:15కు విజయవాడకు చేరుకుంటుంది. విమాన సర్వీసులో ఒకరికి రూ.2,506గా టికెట్ ధరగా ఖరారు చేశారు.

జిల్లా ప్రజల కల

జిల్లా నుంచి విజయవాడకు విమాన సర్వీసును ఎన్నో ఏళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంలో మూడు రోజులు విమాన సర్వీసులు నడిపేలా కేంద్రం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. హైదరాబాదు-ఓర్వకల్లుకు కూడా విమాన సర్వీసులు నడపాలని కోరుతున్నాం.

- మల్లెల రాజశేఖర్, టీటీడీ బోర్డు సభ్యులు

ఎన్నో ఏళ్ల కల సాకారం

ఉమ్మడి కర్నూలు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే విమాన సర్వీసులు ఎంతో ముఖ్యం. విజనరీ సీఎం చంద్రబాబు పదేళ్ల క్రితమే గుర్తించి ఓర్వకల్లు కేంద్రంగా 18 నెలల్లో విమానాశ్రయం నిర్మించి చరిత్ర సృష్టించారు. జూలై 2 నుంచి వారంలో మూడు రోజులు విమాన సర్వీసులు నడిపేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయం.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

మాట నిలుపుకున్న కేంద్ర మంత్రి

ఈ నెల 16న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కర్నూలుకు వచ్చారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి విజయవాడకు విమాన సర్వీసు నడపాలని విన్నవించాం. ఐదు రోజుల్లో మాట నిలుపుకున్నారు. జూలై 2 నుంచి సర్వీసు ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆయనకు కృతజ్ఞతలు.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి విజయవాడకు విమాన సర్వీసు రావడం సంతోషకరం. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని ఒప్పించి ఈ సౌకర్యాన్ని కల్పించాం. ప్రజలు ఈ విమాన సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి. తమ విజ్ఞప్తిని స్వీకరించి అమలు చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

అందరికీ ఆరోగ్య యోగం

- నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్
- ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమావేశం



కర్నూలు కల్చరల్/కర్నూలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ యోగాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి ఏటా జూన్ 21న నిర్వహించేలా ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐక్యరాజ్య సమితి ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏటా ప్రపంచంలో ఎన్నో దేశాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల ఉగ్రవాద మూకలపై భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన తరుణంలో, దేశంలో ఆస్ఫూర్తిని అందరికీ అందిస్తూ, అలాగే ఆరోగ్య భారతావని ఆవిష్కరణలో భాగంగా భారత ప్రధాని ఈ ఏడాది జూన్ 21న రాష్ట్రంలోని విశాఖపట్నంలో జరిగే యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్‌ను నిర్వహిం చాలని ఆదేశాలు జారీ చేసింది. బుధవారం నుంచి జిల్లాలోనూ యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ యోగా ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు గానూ మే 27న ర్యాలీ నిర్వహిస్తారు. జూన్ 2వ తేదీన రంగోలి పోటీలు, జూన్ 16న ఫ్యామిలీ యోగా నిర్వహిస్తారు. జూన్ 17న 75 ఏళ్లు దాటిన వారికి, 18, 19 తేదీల్లో అన్ని స్థాయిలలో యోగా పోటీలు నిర్వహిస్తారు.

గ్రామ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా యోగా శిక్షకులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన ముఖ్యాంశాలుగా ఉంటాయి. శిక్షణ కోసం మండలానికి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను, అర్బన్‌లో 4 వార్డులకు కలిపి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను గుర్తించి జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మే 21 నుంచి 27 వరకు గుర్తించిన ట్రైనర్ ఆఫ్ ట్రైనర్లకు జిల్లా స్థాయిలో శిక్షణ నిర్వహిస్తారు. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు మే 28 నుంచి జూన్ 3వరకు, గ్రామస్థాయిలో జూన్ 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి. యోగా పాటల, పెయింటింగ్, వ్యాసరచన పోటీలను పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో నిర్వహించనున్నారు.

ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మే 21నుంచి జూన్ 21 వరకు నిర్వహించనున్న యోగాంధ్ర క్యాంపెయిన్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్, అడిషినల్ ఎస్పీని ఆదేశించారు. మే 21న జిల్లాస్థాయిలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్, డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ హుశేన్‌పీరా, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎంహెచ్‌వో డా.శాంతికళ, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, యోగా అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేయాలి



యోగా గురువులు, అభ్యాసకులు మన భారత ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. ప్రపంచంలోని అనేక దేశాలు భారత దేశం వైపు చూస్తున్నాయి. ఇక్కడి యోగ రహస్యాలను అన్వేషించాలని తపన పడుతున్నాయి. యోగ శిక్షణలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతివారూ తమ ఆరోగ్యం కోసం ఉపక్రమించాలి. యువత పాశ్చాత్య జీవన శైలిని వీడి, యోగా వైపు దృష్టి పెట్టాలి.

- టీవీ రత్న ప్రసాద్, యోగా గురువు, కర్నూలు

ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది



యోగా అనేది కంటికి కనిపించని ఒక దివ్య ఔషధం. నా జీవితంలో 16 ఏళ్లుగా నిత్యం యోగా ఆచరిస్తున్నాను. నేను గుర్తించింది ఏమిటంటే ఈ 16 ఏళ్లలో నేను ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొగల ఆత్మస్థైర్యం లభించింది. అలాగే ఎలాంటి గాయాలు తగిలినా మరో రోజుకు అవి నయం అయిపోతున్నాయి. కంటి చూపులో ఎలాంటి తేడా రాలేదు. అన్ని రకాల వ్యాధులకు, దీర్ఘకాలిక జబ్బులకు పరిష్కారంగా యోగా నిలుస్తుంది.

- ఆవోపా నాగేశ్వరరావు, యోగా అభ్యాసకుడు

ఐఎఫ్‌ఎస్‌కు నంద్యాల డీటీవో ఎంపిక

ఆలిండియాలో 13వ ర్యాంకు



ఐశ్వర్యారెడ్డి

నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో డీటీవోగా పని చేస్తున్న ఐశ్వర్యా రెడ్డి ఐఎఫ్‌ఎస్‌కు (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) ఎంపికయ్యారు. సోమవారం రాత్రి వెలువడిన తుది ఫలితాల్లో ఆలిండియా 13వ ర్యాంకు సాధించినట్లు ఆమె తెలిపారు. 2022లో గ్రూప్-1 రాసి డీటీవోగా విజయవాడలో రెండేళ్లు పనిచేశారు. ఏడు నెలల కిందట నంద్యాలకు డీటీవో(డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీసర్)గా విధులు నిర్వహిస్తూనే ఇప్పుడు ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికయ్యారు. రోజుకు 14 గంటలు చదివినట్లు ఆమె తెలిపారు. ఆమెది కడప జిల్లా. తండ్రి రామచంద్రారెడ్డి ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, తల్లి పద్మావతి గృహిణి. ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికైన సందర్భంగా ఐశ్వర్యారెడ్డికి పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

డిగ్రీ పరీక్షలో ఒకరు డిబార్

కర్నూలు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2, 6 సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థిని చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ సెమిస్టర్‌కు 2,378 మందికి 2,135, 6వ సెమిస్టర్ పరీక్షకు 101మంది దరఖాస్తు చేసుకోగా 79 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. నలంద డిగ్రీ, హనుమాపురం, పెద్దకడుబూరు మండలం కళాశాలలో విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో డిబార్ చేసినట్లు తెలిపారు.

మహానాడుకు 950 మంది పోలీసులు

కర్నూలు క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో టీడీపీ ఈ నెల 27న తలపెట్టిన మహానాడు కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 950 మంది పోలీసులు బందోబస్తుకు వెళ్తున్నారు. ఒక ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 43 మంది సీఐలు, 47 మంది ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 857 మంది పోలీసులు బందోబస్తుకు నియమించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులు కసరత్తు చేపట్టారు.

జీవాలకు జలమేదీ?

- దాహార్తితో అల్లాడుతున్న పశువులు
- జిల్లాకు 593 నీటి తొట్లు మంజూరు
- నేటికీ 60శాతం మాత్రమే పూర్తి
- లక్ష్యానికి చేరుకొని వైనం



నంద్యాల టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో కూడా నీరు అడుగంటిపోయింది. చాలాచోట్ల జీవాలకు జలం అందక విలవిల లాడుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద కొత్తగా నీటి తొట్టెల నిర్మాణాలు శ్రీకారం చుట్టింది. ఎంత వీలైతే అంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నంద్యాల జిల్లాలో ఇప్పటికే 60శాతం పూర్తి చేసి మూగ జీవాలకు నీటికి అందిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల నీరు అందడం లేదు.

పాడి పరిశ్రమ కోసం..

నంద్యాల జిల్లాలో ఎక్కువగా వ్యవసాయం, పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ మే జూన్ నెలల్లో మూగ జీవాలకే కాదు ప్రజలకు నీటి సమస్య తలెత్తుతుంది. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకునే అవకాశం ఉంది. మూగ జీవాలకు ఆపరిస్థితి లేనందున ప్రభుత్వం అప్రమత్తమై పాడి పరిశ్రమకు ఊతంగా నిధులు విడుదల చేసింది. పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుంది. పశు బీమా చేయిస్తుంది. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పాడిపరిశ్రమ పటిష్టం కావాలన్నదే ప్రభుత్వం లక్ష్యం

పంచాయతీకి రెండు..

ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పశువుల నీటి తొట్టెలు నిర్మాణాలు పంచాయతీకి రెండు చొప్పున మంజూరు చేశారు. కానీ నంద్యాల జిల్లాలో 489 పంచాయతీలు ఉన్నాయి. కానీ 593 నీటి తొట్టెలు మాత్రమే మంజూరు చేశారు. అవి కూడా రెండు నెలలైనా కేవలం 60శాతం మాత్రమే పూర్తి చేశారు. పశువులను బట్టి పంచాయతీలకు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎండకాలం పూర్తి కావస్తున్న ఇంకా పూర్తి కాకపోవడంతో పలు విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో వేచి చూడాలి.



నంద్యాల మండలం మిట్నాల వద్ద నీటి తొట్టి

జిల్లాలో మంజూరైన నీటి తొట్టెలు

నియోజక వర్గం	మంజూరు చేసినవి
ఆళ్లగడ్డ	131
బనగానపల్లె	132
డోన్	113
నందికొట్కూరు	85
నంద్యాల	31
పాణ్యం	32
శ్రీశైలం	69
మొత్తం	593

'ఆడుదాం ఆంధ్ర'పై విజిలెన్స్ విచారణ



రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

హొళగుంద, మే 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర వ్యయంపై హొళగుంద ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు వెంకటరమణ, మల్లేశ్వరమ్మ, విచారణ చేపట్టినట్లు ఎంపీడీవో విజయలలిత మంగళవారం తెలిపారు. కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో విజిలెన్స్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండల, గ్రామ స్థాయిలో చేసిన చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన క్రీడా పరికరాలు, అనంతరం వాటిని ఎవరికి ఇచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. క్రీడాకారులకు భోజన సదుపాయాలు వివరాలను సేకరించారు. కార్యదర్శులు రాజశేఖర్ గౌడ్, నాగరాజు, రంగస్వామి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వినియోగదారులను మోసగిస్తే సహించం

- దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం
- తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): దుకాణదారులు వినియోగదారులను మోసగిస్తే సహించమని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా వారోత్సవాలను వివిధ అనుబంధ వ్యాపార సంస్థలకు అవగాహన కల్పించారు. చివరి రోజు మంగళవారం వెంకటరమణ కాలనీలోని తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు గ్యాస్, పెట్రోల్‌బంకు డీలర్స్ కిరాణా, బంగారు దుకాణ యజమానులు, వినియోగదారులు హాజరయ్యారు. ఈసందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ దుకాణ యజమానులు వినియోగదారులను మోసగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు, కర్నూలు, ఆదోని ఇన్స్‌పెక్టర్లు పరమేశ్వరకుమార్, శ్రీనివాసులు, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు శివమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

అప్పుల బాధతో..

- పురుగుమందు తాగి రైతు బలవన్మరణం

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుమందు తాగి ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని మునగాల గ్రామంలో ఈఘటన చోటుచేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి రంగన్న (44) తనకున్న ఎకరా పొలంతో పాటు ఐదెకరాలు కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రతి ఏడాది పంటలు సరిగా పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. పంటల సాగు కోసం దాదాపు రూ.12లక్షలు అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం పొలం వద్ద పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. విషయం తెలుసుకున్న భార్య, బంధువులు హుటాహుటిన కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సి.బెళగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పోలకల్లు గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన తిరుపాల్ కుమారుడు నాగరాజు(18) విద్యుత్ కాంట్రాక్టర్ శేఖర్ వద్ద డైలీ కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం విద్యుత్ శాఖాధికారుల అనుమతి లేకుండా విద్యుత్ పనులు చేస్తుండగా నాగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ ఏడీ జేసన్, ఏఈ సుకుమార్, ఎస్ఐ పరమేష్‌నాయక్ ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరుకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు

- ఒక్కొక్కరికి రూ.25వేలు జరిమానా



శిక్ష పడిన నిందితులతో పోలీసులు

కర్నూలు లీగల్/ డోన్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయిని విక్రయించడానికి యత్నించిన నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25వేల చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు సెషన్స్ న్యాయాధికారి కమలాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2018 డిసెంబరు 29వ తేదీన నలుగురు నిందితులు చిగురుమానుపేటకు చెందిన ఎరుకలి కావడి మురళి, ఎరుకలి గరిడి సూరి, నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన ఎరుకలి పూసల శివకుమార్, అలాగే విశాఖపట్నం గోలుగొండకు చెందిన ఎరుకుల మేకల శ్రీను డోన్ పట్టణ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. అప్పటి డోన్ టౌన్ సీఐ యు.సునీల్‌కుమార్ తన సిబ్బందితో దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా.. వారు 1.2 కిలోల గంజాయిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసి డోన్ పరిసర ప్రాంతాల్లో విక్రయించాలని పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలుచేశారు. కోర్టులో నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సరళాదేవి వాదించారు.

పోలీసులను అభినందించిన నంద్యాల ఎస్పీ

నిందితులపై కేసు నమోదుచేసి పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో నేరం రుజువు చేసేందుకు కృషి చేసిన పోలీసు అధికారులకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అభినందించారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో విచారణాధికారి శ్రమించి నిష్పక్షపాతంగా కేసును దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేశారని ఎస్పీ వారిని అభినందించారు.

గెలుపు సైనికులు.. టీడీపీ కార్యకర్తలు





ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- సమష్టి కృషితో విజయం సాధించాం
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో టీడీపీ కార్యకర్తలు గెలుపు సైనికులుగా మారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, తమ విజయం వారి కృషి ఫలితమేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20 వార్డులోని ఏఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీడీపీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తల సేవలు ఎన్నటికీ మరవలేనన్నారు. తన గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా కష్టపడ్డారన్నారు. కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా గౌరు దంపతలు వారి ఇంటి ముందు వాలిపోతారని, సంతోషంలోనే కాదు.. కష్టాలోనూ అండగా ఉంటామని, మన అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ మనకు నేర్పించిన విజ్ఞత అని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో పాణ్యం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, అందుకు కార్యకర్తలు మాకు కొండంత బలాన్ని ఇవ్వాలని కోరారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంత ఎత్తుకు ఎదిగినా కార్యకర్తలను మరవబోమని, మీరే మాకు బలం అని పేర్కొన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరైన విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో విజయం ఢంకా మోగించామని, అదే తరహాలో కూడా విజయం సాధించాలని కోరారు. వైసీపీ హయాంలో ప్రాణాలకు తెగించి నిలబడి, కష్టపడిన కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని గౌరు దంపతులను కోరారు. టీడీపీ యువనేత గౌరు జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ఆ పార్టీ అరాచకాలపై ధైర్యం పోరాడినోళ్లు కార్యకర్తలే అన్నారు. భూ కబ్జాలు కేసినా, అక్రమ కేసులు పెట్టి వేధించినా టీడీపీ కార్యకర్తలు భయపడకుండా అడ్రస్ లేకుండా చేశారన్నారు. అనంతరం పలు అభివృద్ధిపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఆదెన్న, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, కల్లూరు కన్వీనర్ రామాంజనేయులు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మాజీ ఎంపీపీ మాధవి, పాలకొలను సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం

కల్లూరు మండలం కొంగనపాడు గ్రామం మాజీ సర్పంచ్, రైతు నాగయ్య మిరప పంటకు వైసీపీ మూకలు నిప్పుపెట్టి కాల్చేశారు. రూ.30లక్షలకు పైగా రైతు నష్టపోయాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నష్టపరిహారంగా సీఎం చంద్రబాబు రూ.10లక్షలు మంజూరు చేశారు. ఆర్థిక సాయం చెక్‌ను రైతు నాగయ్యకు ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులు అందజేశారు.

శ్రీశైలం డ్యాంను పరిశీలించిన శాస్త్రవేత్తలు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వాటర్ పవర్ రీసర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తల బృందం మంగళవారం శ్రీశైలం డ్యాంను పరిశీలించింది. శాస్త్రవేత్తల బృందం హనుమంతప్ప, సునీల్ జె పిళ్లై, డాక్టర్ సంజయ్ బూరలే, డాక్టర్ జీడీ నాయుడు, మహ్మద్ సీ బిస్తా తదితర శాస్త్రవేత్తలు డ్యాం ప్లంజ్‌పూల్ పరిస్థితిని ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్యాం ముందు భాగంలో దెబ్బతిన్న సిలిండర్లను, నీటినిల్వలను, నీటి తాకిడి వల్ల కోతకు గురైన ప్రాంతాన్ని తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు స్థితిగతులను ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఇతర ఇంజనీర్లు వివరించారు.



డ్యాంను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మహానాడు కమిటీల్లో జిల్లా నాయకులు

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పండుగ మహానాడు నిర్వహణ కమిటీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన పలువురు నాయకులకు అవకాశం దక్కింది. కడపలో ఈ నెల 27, 28, 29 తేదీంతో మహానాడును ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. మహానాడు దిగ్విజయం చేయడం కోసం రాష్ట్ర మంత్రులు, ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ముఖ్యనాయకుతో పలు కమిటీలు వేశారు. ఆ కమిటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు ఛాన్స్ దక్కింది. మహానాడు నిర్వహణలో కీలకమైన ఆర్థిక వనరుల కమిటీలో కర్నూలు జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్‌కు అవకాశం ఇచ్చారు. ఈ కమిటీకి మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని సత్యప్రసాద్ కన్వీనర్‌గా యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కన్వీనర్‌గా ఉండే కీలకమైన సమన్వయ కమిటీలో, మంత్రి అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా ఉన్న వసతి ఏర్పాటు కమిటీలో నంద్యాల జిల్లాకు చెందిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. కేంద్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కన్వీనర్‌గా ఉన్న సభా నిర్వహణ కమిటీలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సభ్యులుగా ఉన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పత్రికా, మీడియా, షోషల్ మీడియా కమిటీ కన్వీనర్‌గా అవకాశం ఇచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కన్వీనర్‌గా ఉన్న జనసమీకరణ కమిటీలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిని చేర్చారు.

గొర్రెల మేతగా క్యాబేజీ పంట

పెద్దకడబూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాగిమాన్‌దొడ్డి గ్రామంలో రైతు కుమ్మరి హనుమంతు సాగు చేసిన క్యాబేజీ పంటను గొర్రెలకు మేతగా వదిలేశాడు. ఎన్నో ఆశలతో ఎకరా పొలంలో రూ.70వేలు వెచ్చించి క్యాబేజీ పంటను సాగుచేశాడు. అయితే ఒక ప్యాకెట్ క్యాబేజీ ధర కేవలం రూ.100 నుంచి రూ.150 మాత్రమే పలుకుతోంది. దీంతో చేసేది లేక పంట మొత్తాన్ని గొర్రెలకు మేతగా వదిలేశారు. ఎన్నో ఆశలతో పంటను సాగుచేస్తే రూ.70వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కూరగాయల మార్కెట్‌లో మాత్రం కొనేందుకు వెళ్తే క్యాబేజీని అధిక ధర చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



రాగిమాన్‌దొడ్డిలో గొర్రెలకు మేతగా వదిలిన క్యాబేజి పంట

క్రికెట్ బెట్టింగ్ జోరు



- ఆదోనిలో రంగంలోకి దిగిన పోలీసులు
- అదుపులో నలుగురు బెట్టింగ్ నిర్వాహకులు?

ఆదోని, మే 20 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాల కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఆదోని పట్టణంలో గుట్టు చప్పుడు కాకుండా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు క్రికెట్ బుకీలను ఆదోని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని తమదైన శైలిలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు రోజుల కిందట నలుగురు క్రికెట్ బుకింగ్ అదుపులో ఉంచుకొని వారిని రహస్య ప్రాంతంలో ఉంచి వారి దగ్గర నుంచి క్రికెట్ బెట్టింగ్ సంబంధించిన మరిన్ని వివరాలతో పాటు వెనుక ఉన్న తిమింగలాలు ఎవరన్న దానిపై సమాచారం రాబడుతున్నట్లు సమాచారం. గతంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బుకీల నుంచి రూ.80లక్షల పట్టుబడ్డాయి. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుతం పోలీసుల అదుపులో అప్పటి క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధం ఉన్న ప్రధాన నిందితుడుతోపాటు మహబూబ్ నగర్ జిల్లా ఐజ పట్టణానికి చెందిన మరికొందరిని అదుపులో తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ఎంత మేరకు లావాదేవీలు జరుపుతున్నారు? బుకీలతో ఉన్న ప్రమేయాలపై తమదైన శైలిలో విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధాన పార్టీకి చెందిన కీలక నాయకుడి అనుచరుడు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తి పేరు బయటకు రాకుండా చూసేందుకు మరో యువ నాయకుడు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఆదోని పట్టణానికి చెందిన పోలీస్ అధికారితో ప్రస్తావించగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో కొందరిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామన్నారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తే వివరాలు వెల్లడిస్తామని సమాధానమిచ్చారు.

ఫలించిన చర్చలు

- ఆందోళన కార్యక్రమాలు విరమణ
- ప్రభుత్వ స్పందనపై సర్వత్రా హర్షం
- ప్రభుత్వానికి యూనియన్ నాయకుల కృతజ్ఞతలు
- చర్చలతోనే ఏదైనా సాధ్యమంటున్న ఉపాధ్యాయ సంఘాలు



నంద్యాల ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానంలో పలు విధానాలను ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయి. విధి విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 21, 23వ తేదీన చేపట్టిన ఆందోళనా కార్యక్రమాలు విరమించారు. చర్చలతోనే ఏదైనా పరిష్కారం సాధ్యమవుతుందని ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వం అంగీకరించిన అంశాలు

ఎస్జీటీలను మ్యాన్యువల్ పద్ధతిలో బదిలీలు నిర్వహించడం. ఉన్నత పాఠశాలల్లో 49 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో సెక్షన్ ఏర్పాటుచేయడం. ఫౌండేషన్ పాఠశాలల్లో 20 రోల్ దాటిన తర్వాత రెండవ పోస్టు ఇవ్వడం. ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రాథమిక పాఠశాలలు విడిగా నిర్వహించడం. వర్క్‌లోడ్ ఎక్కువయ్యే సందర్భంగా వర్క్‌లోడ్ ఉన్న సబ్జెక్టులకు అవసరం మేరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను లేదా సర్‌ప్లస్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం. స్టడీ లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయులు ఆగస్టు 2025లోపు చేరే వారి స్థానాలను బదిలీల్లో ఖాళీగా చూపరు. ప్రస్తుత బదిలీల్లో బ్లాకింగ్ లేదు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య పరిష్కారానికి జూన్ నెలలో కమిటీ ఏర్పాటు చేయడం. బదిలీల అనంతరం ఎంఈవో, ప్రధానోపాధ్యాయుల పరస్పర బదిలీలపై నిర్ణయం తీసుకుంటామనడం. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటినప్పుడు ప్రధానోపాధ్యాయున్ని అదనంగా కేటాయించడం.



ప్రభుత్వం సానుకూలంగా..

నూతన విద్యావిధానంలో నెలకొన్న అపరిష్కృత విధానాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ఉపాధ్యాయ సంఘాలతో సత్వర చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

- రామఫక్కీరెడ్డి, పీఆర్‌టీయూ నాయకుడు



ఆందోళనను విరమిస్తున్నాం

విద్యావిధానంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో 21, 23వ తేదీల్లో చేపట్టనున్న ఆందోళనను విరమిస్తున్నాం. ఉపాధ్యాయుల సమస్యలపై కూడా మొండివైఖరికి పోకుండా చర్చల ద్వారా పరిష్కరించడం హర్షనీయం.

- శివయ్య, ఏపీటీఎఫ్ నాయకులు, నంద్యాల



స్వాగతిస్తున్నాం

ప్రభుత్వం విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలపై సానుకూలంగా వ్యవహరించి 70 శాతం సమస్యలను పరిష్కరించడాన్ని స్వాగతిస్తున్నాం. గత ప్రభుత్వం కనీసం చర్చలు జరుపకుండా విద్యావ్యవస్థను పక్కదోవ పట్టించింది, కాని చర్చలతోనే ఏదైనా పరిష్కారం లభిస్తుందని నేటి ప్రభుత్వం భావించడం అభినందనీయం.

- నగిరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకుడు



అనేక సమస్యలు పరిష్కారం

ప్రభుత్వం ఉపాధ్యాయ యూనియన్‌లతో చర్చల ద్వారా అనేక సమస్యలను పరిష్కరించింది. ప్రైమరీ పాఠశాలలో తరగతికి ఒక టీచర్, ఒక ప్రధానోపాధ్యాయున్ని నియమించడంపై ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కానున్నాయి.

- ప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు

పొగాకును కొనుగోలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం



మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు అగ్రికల్చర్, మే 20(ఆంధ్రజ్యోతి): నల్లబర్లి పొగాకు మొత్తాన్ని వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేపడు తామని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం హెచ్చరించారు. మంగళ వారం సీపీఐ సీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్లబర్లి పొగాకు కొనుగోలులో కంపెనీలు సిండికేట్‌గా మారి రైతుల కష్టార్జితాన్ని లాక్కుంటున్నారని ఆరోపించారు. నందికొట్కూరు మండలంలో అగ్రిమెంటు ప్రకారం పొగాకు కంపెనీలు రైతుల నుంచి కొను గోలు చేయలేదని, రైతులు పొగాకును బస్తాల్లో నింపి రోడ్డుపై పడేసీ ఆందోళనలు చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో పొగాకు కంపెనీల గోదా ముల వద్దకు అమ్మకానికి రైతులు తీసుకెళితే నాణ్యత లేదని, ధర తగ్గించడంతో మరోదారి లేక రైతులు పొగాకు బస్తాలను అక్కడే తగల బెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లబర్లి పొగాకును కౌలు రైతులే ఎక్కువగా పండించారని, వారి వద్ద గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల కంపెనీలు వారి నుంచి పొగాకును కొనడం లేదన్నారు. ఈ సమావేశంలో ఓర్వకల్లు సీపీఐ సెక్రటరీ రమేష్, నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

రక్తపోటును ముందుగా గుర్తించాలి

కర్నూలు హాస్పిటల్, మే 20(ఆంధ్రజ్యోతి): రక్తపోటును ముందుగా గుర్తించాలని జిల్లా సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడిదెం పాడు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తపోటు ఉన్న వారిలో కొంత మందిలో బయటకు ఏమీ లక్షణాలు కనబడవని, చిన్న చిన్న విషయాలకే ఎక్కువగా ఆందోళనకు గురై ఎదుటి వారిపై అర వడం, ఉద్వేగానికి లోను కావడం, తలనొప్పి, కంటి చూపు, మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అబ్దుల్ హనీఫ్, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరమణ, పర్యవేక్షకులు నాగమణి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా సతీష్‌కుమార్ రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా కేవీ సతీష్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న సతీష్‌కుమార్ రెడ్డిని డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. కర్నూలు నగర పాలక సంస్థలో గత సంవత్సర కాలంగా డిప్యూటీ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటీ కమిషనర్ కేవీ సతీష్‌కుమార్‌రెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

రీ సర్వేపై ముందుస్తు సమాచారం ఇవ్వాలి

ఆర్డీవో సందీప్‌కుమార్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సందీప్‌కుమార్

సి.బెళగల్, మే 20(ఆంధ్రజ్యోతి): రీ సర్వేపై రైతులకు ముందుస్తు సమాచారం ఇవ్వాలని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో చేపట్టిన రీ సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రీ సర్వే చేస్తున్న పొలాలలో రైతులు తమ పట్టాదారు పాసుబుక్‌లను సర్వేయర్లకు చూపాలన్నారు. రీ సర్వేలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని తహసీల్దార్ పురుషోత్తం, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, సర్వేయర్లకు ఆదేశించారు. ఆర్డీవో వెంట రీ సర్వే తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు ఉన్నారు.

ఉల్లి పంట పరిశీలన

సి.బెళగల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఎర్రమల అనే రైతు డ్రిప్‌తో సాగు చేసిన ఉల్లి పంటను అనంతపురం శాస్త్రవేత్త రామ్‌శర్మ, కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్ మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని మారందొడ్డి, పులకుర్తి, గూడూరు, పోన్నకల్, ఇనగండ్ల, పోలకల్లు గ్రామాల్లో రైతులు సాగు చేసిన దానిమ్మ, బొప్పాయి, మామిడి తోటలను కూడా వారు పరిశీలించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త రామ్‌శర్మ మాట్లాడుతూ డ్రిప్‌తో పంటలను సాగు చేస్తే నీటిని పొదుపు చేసుకోవచ్చునని అన్నారు. వీరి వెంట హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాయక్, రైతులు ఉన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ ఆహ్వానిత ఇన్విటేషన్ అండర్-14 బాలబాలికల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఉన్నత విద్య అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ కేవీ మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో 13 బాలుర జట్లు, 6 బాలికల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి షరీఫ్ అహ్మద్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, పి.విజయ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవితేజ, ఇండియన్ పోలీస్ జాఫర్, వనం రాజు, అధ్యాపకులు, జిల్లా వైస్ ప్రెసిడెంటు ఖలందర్ భేగ్, కొండేపోగు చిన్న సుంకన్న, మహేశ్వరరావు, యూసుఫ్‌బాషా, రాజేష్, వాలీబాల్ మిస్నెల, శ్రీధర్, విశ్వం, అఖిల్, కళ్యాణ్, అఫ్జల్, సురేష్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల నిరసన



కర్నూలులో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు



కోడుమూరులో..



ఓర్వకల్లులో..



గూడూరులో..

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లేబర్ కోడ్లను రద్దుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఐటీయూ నగర కార్యదర్శి విజయ్ అధ్యక్షతన జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. లలితమ్మ మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం అమలు చేయాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్లతో కార్మిక వర్గం కనీస వేతనం, ఉద్యోగుల భద్రత కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రధాని నరేంద్ర మోదీ నల్ల చట్టాలను రద్దు చేస్తానని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఉపాధి కూలీలకు కూలి రూ.600 పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారా యణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.సుంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సురేష్ నాయక్, ఏఐటీయూసీ నగర డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు మహేష్, రమీజాబీ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రభుత్వ రంగాల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగన్న కోరారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లులో రైతు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమానికి రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు షాజహాన్, శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ ఉన్న ఉద్యోగాలనే ఊడగొడుతున్నారని ఆరోపించారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మల్లేష్, చాంద్‌బాషా, మహేష్, మాసూంబాషా, బషీర్, మురళి, ఎల్లరాజు, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కోడుమూరు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న పిలుపునిచ్చారు. స్థానిక కోట్ల సర్కిల్‌లో మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకం నిధులు పెంచాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీ యూసీ నాయకులు మద్దిలేటి, లక్ష్మన్న, బుడ్డన్న, తాయప్ప, రాజు, రాము డు, మునిస్వామి పాల్గొన్నారు.

గూడూరు: లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం గూడూరు పట్టణంలో కేంద్ర కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల కమిటీల పిలుపు మేరకు గూడూరు పాత బస్టాండులో సీఐటీయూ మండల అధ్యక్షుడు గుంటప్ప అధ్యక్షతన నిరసన తెలిపారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా 44 రకాలు కార్మికుల చట్టాలను కుదించి వాటిని నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌పీల సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, హమాలీ సంఘం నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల దీక్ష



దీక్ష చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, మే 20(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు మంగళవారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. గత 9 సంవత్సరాలుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు కేవలం రూ.7,870 వేతనంతో పని చేస్తున్నారని, ప్రభుత్వాలు మారినా కూడా వేతనాలు పెరగడం లేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని, డ్రైవర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, 8 గంటల పనివిధానం అమలు చేయాలని, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని కోరారు. అనంతరం దీక్ష శిబిరం నుంచి ఉద్యోగులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే.రంగస్వామి, జిల్లా కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, కోశాధికారి నరేంద్రరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీతకు సన్మానం



మంజులదేవిని సన్మానిస్తున్న పత్తి ఓబులయ్య

కర్నూలు హాస్పిటల్, మే 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న డి.మంజులదేవికి ఇటీవల విజయవాడలో హెల్త్ కేర్ చారిటబుల్ ట్రస్టు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందజేశారు. మంగళవారం నగరంలోని సి.క్యాంపు టీజీవీ కళాక్షేత్రంలో కళారత్న పత్తి ఓబులయ్య ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీత మంజులదేవిని సన్మానించారు. మంజులదేవి ప్రభుత్వ ఆసు పత్రుల్లో 24 సంవత్సరాలు విశేష సేవలందించారని కొనియాడారు.

వ్యక్తిపై కేసు నమోదు

కర్నూలు క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సుహేల్ బాషాపై కేసు నమోదైంది. గురుబ్రహ్మనగర్‌కు చెందిన సుహేల్ బాషాకు రాజీవ్‌నగర్‌కు చెందిన యువతితో గత నెల 12వ తేదీన రెండు కుటుంబాల సమక్షంలో ఎంగేజ్‌మెంటు జరిగింది. ఆ తర్వాత పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడకపోవడంతో ఆ యువతి తల్లి దండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనవసరమైన నిందలు వేసి తనను పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడటం లేదని యువతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

తైక్వాండోతో ఆరోగ్యం

కర్నూలు స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి): తైక్వాండో మార్షల్ ఆర్ట్స్‌తో ఆరోగ్యం కలుగుతుందని ఫైనార్టీ టౌన్ ప్రెసిడెంటు జి.అబ్దుల్ హమీద్ అన్నారు. మంగళవారం కొండారెడ్డి బురుజు, పెద్ద మార్కెట్ కేఎంసీ పార్కులలో రెండు శిక్షనా కేంద్రాలను ఆయన సందర్శించి క్రీడాకా రులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం అబ్దుల్ హమీద్‌ను తైక్వాండో కోచ్ టి.వెంకటేశ్వర్లు శాలువతో సన్మానించారు. కార్యక్ర మంలో ఇండియా చీఫ్ కరాటే కేఎండీ షకీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌లో ఈనెల 23 నుంచి 26వరకు జరగనున్న 36వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు రియాజ్, జగదీష్, భువనేశ్వర్ ఎంపికైనట్లు జిల్లా సంఘం కార్యదర్శి డా.రుద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో అభినందించారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీని వాసులు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పోరాటం

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): దేశంలో 60 శాతం ఉండే యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో యువత ప్రధానంగా నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటుందన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటు కోసం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవే టీకరణ ఆపాలని ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈసమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బీసన్న, చంటి, కృష్ణ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

కర్నూలు అగ్రికల్చర్, మే 20(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈగల్ ఎస్‌ఐ సృజన్‌కుమార్ అన్నారు. మంగళవారం మార్కెట్ యార్డులో కార్మికులు, రైతులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఈగల్ ఎస్‌ఐ సృజన్‌కుమార్ మాట్లాడుతూ గంజాయిని పండించిన, అమ్మినా, లేదా రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అటువంటి వారి సమాచారం ఏమైనా ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్.1972కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం డ్రైవర్లు, కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. మార్కెట్ కమిటీ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, టీజీ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంటు శేషగిరిశెట్టి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్‌సింగ్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఏపీడీ

సి.బెళగల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏపీడీ అల్లీపీరా సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లా డుతూ జాబుకార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను వినియో గించుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనులకు రానివారికి మస్టర్‌లో హాజరు వేస్తున్నారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆయన విచారణ చేపట్టారు. ఆయన వెంట ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉన్నారు.

ఈశ్రమ్ కార్డుతో ప్రయోజనం

కోడుమూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఈశ్రమ్ కార్డుతో ప్రయోజనం చేకూరుతుందని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రాయలసీమ జోనల్ హెడ్ బాలునాయక్, డిప్యూటీ కమిషనర్ కుంబా వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అమడగుంట్ల గ్రామంలో మంగళ వారం ఉపాధి శ్రామికులతో వారు మాట్లాడారు. 16 నుంచి 59 ఏళ్ల వరకు కార్మికులంతా ఈశ్రమ్‌కార్డుకు ఉచితంగా నమోదు చేసుకోవచ్చని, ప్రమాదంలో మరణించిన, శాశ్వత వైకల్యం కలిగితే రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష పరిహారం అందుతుం దన్నారు. అనంతరం లేబర్ ఆఫీసర్ కేశన్న ఆధ్వర్యంలో సుమారు 156 మంది కార్మికులు ఈశ్రమ్‌కార్డుకు పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ, ఏపీవో మోదీన్‌బాషా, టీఏ రవికుమార్ పాల్గొన్నారు.

రేపు హనుమజ్జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మున్సిపల్ గ్రౌండ్‌లో హనుమజ్జయంతి, ఆపరేషన్ 'సిందూర్' విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు కె. క్రిష్టన్న తెలిపారు. మంగళవారం నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో గల వినాయక మందిరం సమావేశ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల్లో దేశానికి ఎల్లవేళలా విజయం చేకూరాలని సంకల్పిస్తూ వేయి మందితో సామూ హిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ప్రముఖ ప్రవచన కర్త, నటుడు గుర్రపుశాల అంకయ్యచే శ్రీరామాయణ మహా కావ్యంపై ప్రవచన బోధన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఇతర ప్రతినిధులు నాగోజీరావు, ఎస్‌జీ మహాబలేష్, కల్కి మురళి, నారాయణరెడ్డి, అచ్చి, మామిళ్లపల్లి రాజేశ్‌శర్మ, రాఘవేంద్ర, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీజీ మద్దిలేటి, ఆవోపా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు గోకుల క్షేత్రంలో : నగర శివారు మామిదాలపాడులోని గోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకొని గురువారం ఉదయం 6.30 గంటలకు గోష్టి, 7 గంటల నుంచి దాస ఆంజనేయ స్వామికి అభిషేకం, సింధూర అర్చన, 8 గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని తెలిపారు. అలాగే ఆలయ బయట 20 అడుగుల మూలవి రాట్ ఆంజనేయ స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

లలితా పీఠంలో.. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో గురువారం సాయంత్రం 6 గంటలకు హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. భారత వీర జవానులు సాధించిన విజయాన్ని పురస్కరించుకొని పీఠంలోని పంచముఖ ఆంజనేయ స్వామి సన్నిధిలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా ఉద్యోగికి తీవ్ర గాయాలు



ముకుంద ప్రియను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): నన్నూరు గ్రామ సమీపంలోని నారాయణ జూనియర్ కాలేజీ ఎదుట మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. నన్నూరు-2 గ్రామ వ్యవసాయ సహాయకురాలిగా పని చేస్తున్న ముకుంద ప్రియ కర్నూలు నుంచి నన్నూరులో విధులకు స్కూటిపై వెళ్తుండగా.. నారాయణ కాలేజీ సమీపంలో రోడ్డుపై నిలిచివున్న లారీ సడెన్‌గా రావడంతో వెనకు వైపు నుంచి వస్తున్న ముకుంద ప్రియ స్కూటి లారీ వెనుక భాగాన ఢీకొనడంతో ఆమెకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెను ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు వెంటనే హైవే పెట్రోలింగ్ అంబులెన్సులో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఓర్వకల్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ పరిశీలించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముకుంద ప్రియను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, గ్రామ నాయ కులు విశ్వేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారులు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే గౌరు చరిత వైద్యులను ఆదేశించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటిని వృథా చేస్తే కొళాయి కనెక్షన్ కట్: కమిషనర్



నీటి వృథాను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎవ్వరైనా తాగునీటిని వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య సముదాయాలకు కొళాయి కనెక్షన్ కట్‌చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బాపూజీ నగర్, పాతబస్టాండ్, సి.క్యాంపు రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించారు. బాపూ జీ నగర్‌లో డ్రైనేజీ కాలువలో మురుగునీరు ప్రవాహం అధికారంగా ఉండటంతో సిల్ట్ తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో కొందరు తాగు నీటిని వృథా చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ స్థానిక ప్రజలకు నీటిని సక్ర మంగా వాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి, కొండారెడ్డి బురుజు సమీ పంలోని అన్న క్యాంటీన్‌లను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగ రాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వలి, అనిల్ ఉన్నారు.

సచివాలయ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం : విధుల సమయంలో సచివాలయంలో ఉండకుండా బయటికి వెళ్లిన కార్యదర్శులపై కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన బీ.క్యాంపులోని 56, 57వ సచివాలయాలను తనిఖీ చేశారు. 56వ సచివాలయంలో వీఆర్‌ఓ, ప్లానింగ్ సెక్రటరీలు అందుబాటులో లేకపోవడం ఎక్కడి వెళ్ళారో మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

26న బి.తాండ్రపాడులో బండలాగుడు పోటీలు

కర్నూలు రూరల్ మే 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలో గోకారమయ్య ఉరుసు పురస్కరించుకొని ఈనెల 26న ఆరు పళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచు టీడీపీ నాయకుడు ఆకెపోగు జయన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసులో భాగంగా ఈనెల 24న గంధం, 25న కిస్తీలు ఉంటాయన్నారు. గెలుపొందిన విజేత జట్లకు మొదటి, రెండో, మూడో, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.50వేలు, రూ.40వేలు,రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేయన్నుట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రవేశ రుసుం రూ.600 చెల్లించాలని, వివరాలకు 9676586157 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

కర్నూలు న్యూసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): తమకు జీతాలు పెంచాలని కోరుతూ కొనసాగుతున్న ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం కొనసాగింది. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు.

కార్యకర్తలే టీడీపీకి అండ

- టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు
- ఆదోని, ఆలూరులో నియోజకవర్గ మహానాడుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



ఆదోనిలో టీడీపీ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఆదోని, మే20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అండ అని టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని జేబీ గార్డెన్స్‌లో నియోజకవర్గ మహానాడు నిర్వహించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భవించి 42 ఏళ్లు కాగా, 23 ఏళ్లు అధికారంలో ఉన్నామని, ఇందుకు కార్యకర్తల కృషి ఉందని కొనియాడారు. తాను మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఉన్నా, తనకు ఆస్తి కార్యకర్తలే అన్నారు.

తండ్రిలాంటి చంద్రబాబు తమను ఖచ్చితంగా గుర్తిస్తారన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మొదట్లో ఇక్కడకు రాలేదని, అయినా అధినాయకత్వం సూచన మేరకు ఇద్దరినీ గెలిపించుకున్నామని గుర్తు చేశారు. ఆదోని ఎమ్మెల్యేకు కొందరు తప్పుడు సూచనలు ఇచ్చారని, దీన్ని ఎమ్మెల్యే ఇప్పుడు గ్రమించారన్నారు. 1.3కోట్ల సభ్యత్వాలతో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను మనం కూడా చేయకూడదని, సంపద సృష్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. కార్యకర్తలు, నాయకులకు మధ్య విభేదాలు లేకుండా కలిసి పనిచేస్తామన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అప్పట్లో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో అక్రమ కేసులతో కార్యకర్తలందరూ నిద్రలేని రాత్రులు గడిపారన్నారు. జిల్లా కార్యదర్శి భూపాల్ చౌదరి మాట్లాడుతూ ఆదోనిలో టీడీపీకి బలమైన కార్యకర్తలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, అబ్జర్వర్ సుబ్బారెడ్డి, సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి భూపాల్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి మారుతి నాయుడు, కౌన్సిలర్ పార్వతి, మాజీ ఎంపీటీసీ రంగన్న, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, చాగి మల్లికార్జున రెడ్డి, బసవరాజు, రామస్వామి పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: ఎంపీ

ఆలూరు, మే20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో మినీ మహానాడును టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడతల వారీగా సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నా, కనీసం ప్రతిపక్ష హోదా లేని వైసీపీ విమర్శలు చేయడం సరికాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పింఛన్లను పెంచారని, పాఠశాలలు ఆరంభమయ్యే నాటికి తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తారన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కూడా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తుందన్నారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సీఎంకు విన్నవిస్తామన్నారు. చంద్రబాబు జన్మదిన వేడుకల్లో గుండెపోటుతో మృతిచెందిన తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర కుంటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏబీసీడీసీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, యువనేత గిరిమల్లేష్‌గౌడ్, రఘుప్రసాద్‌రెడ్డి, అట్టెకల్ జగన్‌మోహన్‌బాబు, చింతకుంట రమేష్, మండల కన్వీనర్లు అశోక్, పరమారెడ్డి, తిప్పయ్య, సుధాకర్, కృష్ణంనాయుడు, శివప్రకాష్, రామ్‌నాథ్ యాదవ్, రవియాదవ్, సుభాష్, కప్పట్రాళ్ల మల్లికార్జున, సతీష్, నరసప్ప పాల్గొన్నారు



ఆలూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు



ఆదోనిలో నాయకులకు సన్మానం



ఆలూరులో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

రేషన్ కార్డులో మార్పు, చేర్పులకు అవకాశం

ఆదోని టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్ కార్డులతో పాటు సభ్యుల పేర్లలో మర్పు, చేర్పులకు అవకాశం ఉందని కమిషనర్ కృష్ణ తెలిపారు. ఈనెల 31వ తేదీల్లోగా సచివాలయాల్లో దరఖాస్తు చేయాలన్నారు. కొన్ని సచివాలయాలలో సిబ్బంది సెలవులో ఉన్న కారణంగా ఇన్‌చార్జిని నియమించామన్నారు. లబ్ధిదారుల సందేహాలను తీర్చేందుకు మున్సిపల్ కార్యాలయంలో గుమస్తాను ఏర్పాటు చేశామని కమిషనర్ అన్నారు.

మహానాడు కోసం ఎమ్మెల్యే పూజలు

పత్తికొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించనున్న మహానాడు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ పెద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శ్యాంబాబు మంగళవారం పూజలు నిర్వహించారు. కృష్ణ, చౌదరి పాల్గొన్నారు. బుధవారం వెల్దుర్తిలో నిర్వహిస్తున్న మినీ మహానాడుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

చెరువులకు గండ్లు

దేవనకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేముల, గుడిమిరాళ్ల చెరువులకు గండ్లు పడ్డాయి. నాలుగు రోజుల క్రింతం కుండపోతగా కురిసిన వర్షం చెరువులు నిండాయి. అయితే గండి పడటంతో నీరు వృథా అవుతోంది. మంగళవారం మైనర్ ఇరిగేషన్ పత్తికొండ డీఈ జిలానీ బాషా, ఏఈఈ సోమన్న గండ్ల పూడ్చివేత పనులు ప్రారంభించారు. కరివేముల చెరువుకు తూము, షట్టర్ పనిచేయక 247 ఎకరాలకు సాగునీరు అగిపోతుందని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. గుడిమిరాళ్ల చెరువు కింద 60 ఎకరాల ఆయకట్టు ఉందని, పూడ్చేందుకు రెండురోజుల నుంచి ప్రయత్నించినా అదుపులోకి రాలేదని, సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేస్తామన్నారు. సాగునీటి సంఘం చైర్మన్ అబ్బా రంగన్న, బంటుపల్లి వెంకటస్వామిగౌడ్ ఉన్నారు



గుడిమిరాళ్ల చెరువు గండిని పరిశీలిస్తున్న అధికారులు

మినీ మహానాడును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు ఆధ్వర్యంలో వెల్దుర్తిలో నిర్వహించనున్న మినీ మహానాడును జయప్రదం చేయాలని టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శులు బత్తిన వెంకట్రాముడు కోరారు. మంగళవారం మాట్లాడుతూ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. అలాగే కడపలో నిర్వహించనున్న మహానాడుకు తరలిరావాలని కోరారు. తిమ్మయ్య చౌదరి, వెంకటస్వామి, తిరుపాల్ నాయుడు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

హాలహర్వి, మే 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గూళ్యం, జె.హొసళ్లి, అర్ధగేరి గ్రామాల్లో పర్యటించారు. భూ తగాదాలు, ఇంటి స్థల పంచాయితీలు, రేషన్ సమస్యలు, రీ సర్వే సమస్యలు లేకుండా చూస్తామన్నారు. పరస్పరం చర్చించుకుంటే ఎలాంటి భూ సమస్యలైనా పరిష్కారమవుతాయని, తమకు ఫిర్యాదు చేస్తే రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. అనంతరం అర్ధగేరి గ్రామంలో రీ సర్వే చేసుతన్న సర్వేయర్ భార్గవితో మాట్లాడారు.

స్థలాలను అన్యాక్రాంతం కానివ్వం

మద్దికెర, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కానివ్వమని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. మంగళ వారం గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. జిల్లా అధికారులు మండలానికి కస్తూర్బా, గురుకుల పాఠశాల మంజూరు చేశారని స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. డీటీ శ్రీదేవి, వీఆర్వో రంగస్వామి, ఆర్ఐ రాందాస్, సర్వేయర్ బాలు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రైతులను విస్మరించిన ప్రభుత్వం

- అందని బీమా పరిహారం : ఎమ్మెల్యే విరుపాక్షి



కామినహాల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

హాలహర్వి, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం రైతులను విస్మరించిందని, బీమా పరిహారం ఇవ్వడంలో విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. మంగళవారం కామినహాల్ గ్రామంలో మాట్లాడుతూ కల్లిబొల్లి మాటలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబుకు ఏడాది పూర్తవుతున్నా సంక్షేమ పథకాల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. 2023, 2024 ఖరీఫ్ పంటల బీమా రైతుల ఖాతాల్లో జమ కాలేదని, రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. పెట్టుబడి సాయం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, వర్షాలు కురుస్తున్నాయని సకాలంలో విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ పద్మ, వైసీపీ కార్యదర్శి జనార్ధన్‌నాయుడు, అర్ధగేరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

తుగ్గలి, మే 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ, ఆశా, హమాలీలతో పాటు కార్మికులకు కూడా పనికి తగ్గ వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు రంగస్వామి, సీపీఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

పత్తికొండ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వృద్ధాశ్రమంలో తెలుగు యువత నాయకులు బీటీ పవన్ కుమార్ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వృద్ధుల మధ్య కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కారక్రమంలో బీటీ శివరాజు, వినయ్‌గౌడు, రాతన రాజు, బీటీ హరి, బళ్లారి సాయిచక్రి, రామచంద్ర, సురేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రినాయుడు, ఎంపీటీసీ రహీంతుల్లా, యువ నాయకుడు సతీష్‌కుమార్ నిర్వహించారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

మద్దికెర, మే 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం ఎం.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పే విదంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయ పాలన పాటించాలని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు రోజూ కోడిగుడ్డుతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు కార్యకర్తలు సుంకమ్మ తదితరులు ఉన్నారు.

ఆలూరు రూరల్: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను టీడీపీ తాలుకా అధ్యక్షుడు డాక్టర్ నెట్టెప్ప ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.

పండ్ల మొక్కలతో రైతులకు ఆదాయం

హాలహర్వి, మే 20(ఆంధ్రజ్యోతి): పండ్ల మొక్కలు పెంచితే రైతులకు ఆదాయం వస్తుందని ఏపీవో చక్రవర్తి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీ కింద మొక్కలు ఇస్తుందని, పెంపకానికి నిధులు ఇస్తుందన్నారు

నాన్ లే అవుట్లలో ప్లాట్లు కొనొద్దు

ఆదోని టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): నాన్ లే అవుట్లలో ప్లాట్లను కొనవద్దని టీపీవో బాల ముద్దయ్య సూచించారు. మంగళవారం మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో కొందరు నాన్ లేఅవుట్లను వేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అక్కడ కొనే స్థలాల్లో అభివృద్ధి పనులు చేయమని, ఇంటి నిర్మాణం సమయంలో యజమానులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందన్నారు.

పాడిరైతులకు రాయితీ దాణా

హాలహర్వి, మే20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులకు రాయితీ కింద దాణా ఇస్తామని పశువైద్యాధికారి అశోక్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ పశుగ్రాసం ధరలు పెరిగి, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు రూ.550లు చెల్లిస్తే 50 కేజీల దాణ అందజేస్తామన్నారు.

నేడు రథోత్సవం

ఆలూరు రూరల్, మే20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాత్రికి గ్రామం రంగస్వామి, వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని నేడు బుధవారం నిర్వహిస్తున్న గ్రామస్థులు తెలిపారు. ఉదయం గంగిపూజ, పంచామృతశేకం చేస్తామన్నారు. సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు.

జనావాసాల్లో వ్యర్థాలను వేయకండి

వెల్దుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాలను జనావాసాల్లో వేయవద్దని, అలా వేస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి గురుస్వామి హెచ్చరించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలను జనావాసాల మధ్య పారవేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. వ్యర్థాలను చెత్త వాహనాల్లో మాత్రమే వేయాలని తెలియజేశారు.

కిశోరి వికాసం

వెల్దుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో మదార్‌పురం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి 'కిశోరి వికాసం' నిర్వహించారు. లింగ అసమానతపై బాలికలకు అవగాహన కల్పించారు. అమ్మాయిలు అబ్బాయిలతో పోటీ పడాలని, సూచించారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేంచుకొని చదువుల్లో రాణించాలన్నారు. ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సరస్వతి

జయప్రదం చేయండి

వెల్దుర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న నియోజకవర్గ మహానాడును జయప్రదం చేయాలని ఆ పార్టీ కన్వీనర్ బలరాంగౌడ్, జిల్లా నాయకుడు సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం మాట్లాడు తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 27 నుంచి కడపలో నిర్వహించే మహానాడుపై చర్చిస్తామన్నారు. క్రిష్ణగిరి, తుగ్గలి, మద్దికెర, పత్తికొండ, వెల్దుర్తి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. నాయకులు ఈదుల వెంకటరాముడు, సుధాకర్‌గౌడు, బజారు, అమర్‌నాథ్‌గౌడ్, వీరభద్రుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా అభిమాన సంఘం అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక గౌరీ థియేటర్‌లో కేక్ కట్ చేశారు.



దేవనకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలారుదిన్నే గ్రామం వద్ద హంద్రీనది వంతెన రెయిలింగ్ దెబ్బతింది. ఈ మార్గంలోనే వేలాది వాహనాలు కర్నూలు నుంచి బళ్లారికి వెళుతుంటాయి. వాహనాలు ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంది. ఏమాత్రం అదుపు తప్పినా 30 అడుగుల లోతు నదిలో పడిపోయే ప్రమాదం ఉంది. రెయిలింగ్ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ కుమార్



ఆదోని టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తామని ఆదోని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ కుమార్ తెలిపారు.

ప్రశ్న: పారిశుధ్యానికి ప్రాముఖ్యత ఇస్తున్నారా?

జవాబు: విధుల్లో చేరి నెల అయింది. వార్డుల్లో సిబ్బందితో కలసి తిరిగి పరిస్థితులు తెలుసుకుంటా. పరిశుభ్రత ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు.

ప్రశ్న: పారిశుధ్య పనులను ఎలా పర్యవేక్షిస్తారు?

జవాబు: చెత్త తరలింపును వేగవంతం చేయాలి. రోజూ 800 టన్నుల మేర చెత్త డంప్‌యార్డుకు తరలుతోంది. పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడానికి ప్రణాళికలు తయారు చేస్తాం.

ప్రశ్న: ప్లాస్టిక్ వస్తువుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

జవాబు: తక్కువ సామర్థ్యం గల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రేతలపై దాడులు చేసి, ప్లాస్టిక్ సామగ్రిని అక్కడికక్కడే ధ్వంసం చేస్తాం. ఇకపై పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆకస్మిక దాడులకు రంగం సిద్ధం చేస్తున్నాం.

ప్రశ్న: ఆహార పదార్థాల కల్తీ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దాడులు చేసాం. కల్తీ ఉంటే కేసులు నమోదు చేస్తాం. గతంలో చేసిన దాడులకు సంబంధించి 8 కేసులు కోర్టులో ఉన్నాయి.

ప్రశ్న: అనుమతి లేని మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారా?

జవాబు: అనుమతి పత్రాలు సమర్పించాలని ఆర్వో ప్లాంట్ల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

ప్రశ్న: రసాయనాల ద్వారా పండ్లు మాగపెట్టే వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే చర్యలను సహించం. దాడులు నిర్వహించి, కేసులను నమోదు చేస్తాం.

ప్రశ్న: జనన, మరణ నమోదులో ఆలస్యం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: దీన్ని గమనించా, ఆసుపత్రుల నుంచి సమాచారం అందడం ఆలస్యమవుతోంది. వారంలోపు పంపాలని ఆదేశించాం.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ఆస్పరిలో ధర్నా చేస్తున్న నాయకులు

ఆస్పరి, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఐ కార్యదర్శి విరుపాక్షి, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికులను బానిసలుగా మార్చేలా కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ఉరుకుందప్ప, రంగప్ప, రూతమ్మ, మేనక, గుంటమ్మ, నూర్జహాన్, ఫాతిమా, దుర్గమ్మ, రజిని, వీరేశమ్మ, రంగవేణి, సులోచన,శ్రీలీల, హమాలీ సంఘం నాయకులు పాండు, బస్సీ, రవి, రామకృష్ణ, బజారి, నాగరాజు, శేఖర్, షులి, కృష్ణ పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

హొళగుంద, మే 20(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ నాయకులు వెంకటేష్, చాకలి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం తహసీల్దార్ నిజాయుద్దీన్‌కు వినతిప్రతం అందించారు. రామాంజినేయులు, రైతు సంఘం నాయకులు కృష్ణయ్య, రవి , వీఆర్‌వోలు మౌలలి, సోమలింగా, హమాలి నాగరాజు పాల్గొన్నారు.



హొళగుందలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టీడీపీ అంటేనే సంక్షేమం



నియోజకవర్గ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

- ఐదేళ్ల వైసీపీ పాలనకు, కూటమి ఏడాది పాలనకు బేరీజు వేసుకోండి : ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ఎమ్మిగనూరు అభివృద్ధిని కాంక్షించిన దివంగత మాజీ మంత్రి బీవీ : టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి
- సంక్షేమం అంటేనే టీడీపీ : ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మే20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల చేతగాని దద్దమ్మ పాలన సాగిందని, వ్యవస్థలన్నింటినీ జగన్ సర్వనాశనం చేశారని, చంద్రబాబుపై నమ్మకంతోనే ఎన్నికల్లో ప్రజలు 164 సీట్లు ఇచ్చారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని కుర్ణి కమ్యూనిటీ హాల్‌లో టీడీపీ నియోజకవర్గ మహానాడును ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మినీ మహానాడుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగన్‌లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడు చూడలేదని, ఐదేళ్ల తుగ్లక్ పాలన నడిపారన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని దేశ చిత్రపటంలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు మనమంతా మద్దతుగా నిలవాలన్నారు. ఈనెల 27, 28 కడపలో జరిగే మహానాడుకు రాష్ట్రంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. అనంతరం ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనకు, ఏడాది కూటమి ప్రభుత్వ పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. ఈ ఏడాదిలోపే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు సీఎం అమలు చేశారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని గెలిపించి ఎమ్మెల్యే బీవీకి మద్దతుగా నిలవాలన్నారు. అంతకుముందు టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు అభివృద్ధిని కాంక్షించి సీసీ రోడ్ల దగ్గర నుంచి అగ్నిమాపక కేంద్రం, ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణాలతో పాటు ఉమ్మడి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత ఒక్క దివంగత బీవీ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉమ్మడి నియోజకవర్గంలో గురురాఘవేంద్ర అంటేనే రైతులకు, ప్రజలకు ముందుగా బీవీ మోహన్‌రెడ్డి గుర్తుకు వస్తారన్నారు. బీవీ మోహన్‌రెడ్డి వారసత్వ లక్షణాలను పునికి పుచ్చుకున్న జయనాగేశ్వరరెడ్డి కూడా ఎమ్మిగనూరు అభివృద్ధికి పాటుపడుతుండడం అభినందనీయమన్నారు.



హాజరైన నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పేదలకడుపు నింపిన ఘనత కూటమి ప్రభుత్వానిది : ఎమ్మెల్యే బీవీ

సంక్షేమం..అభివృద్ధి అంటేనే ముందుగా గుర్తుకు వచ్చేది ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, టీడీపీ పార్టీయేనని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ 11నెలల కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట మేరకు ల్యాండ్ టైటిల్‌లీడ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. అలాగే అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి పేదవారి కడుపు నింపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెన్షన్ రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్లు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌లను పెంచడంతో పాటు 1వ తేదీన ఇంటి దగ్గరే అందిస్తున్నామన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.300 కోట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో మంజూరు చేయించడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1980 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తే ఐదేళ్ల వైసీపీలో దాన్ని భ్రష్టు పట్టించి పనులు నిలిపివేశారని మండిపడ్డారు. ఆర్డీఎస్ ప్రాజెక్టును జగన్ కేంద్ర గెజిట్‌లోకి పోయేలా చేసి సర్వనాశనం చేశారన్నారు. దాన్ని తిరిగి తీసుకువచ్చి దీర్ఘకాలంలో పూర్తి చేస్తామన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా తాగు, సాగునీరు అందించేందుకు ఒక కొత్త పథకాన్ని సీఎంకు వివరించడం జరిగిందని, త్వరలో మనకు ఒక శుభవార్త వస్తుందన్నారు. నేడు 100 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తున్నామన్నారు. నాటి రాజకీయలకు అనుగుణంగా తనతండ్రి బీవీ మోహన్‌రెడ్డి రాజకీయం చేశారని, అప్పటి పరిస్థితులు వేరని.. ఇప్పటి పరిస్థితులు వేరన్నారు. ఎన్నికలకు ముందు తనపేరును ప్రకటించిన తర్వాత కూడా కొంతమంది తన గొంతు, పార్టీ గొంతు కోసే విధంగా వ్యవహరించారని, అలాంటి వారిని క్షమించేదిలేదన్నారు. కడపలో జరిగే మహానాడుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మంత్రాలయం మహానాడుకు వేలాదిగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు

కష్టపడి జెండా మోసిన ప్రతి కార్యకర్తలకు, నాయకులకు ఆలస్యమైనా టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇంచార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రాలయంలోమినీ మహానాడువిజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి , కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు, నియోజకవర్గ పరిశీలకులు ధర్మవరం సుబ్బారెడ్డి లు పాల్గొన్నారు. వీరికి రాఘవేంద్రరెడ్డి, జిల్లా రైతు అధికార ప్రతినిధి, దూదేకుల రాష్ట్ర గౌరవ సలహాదారుడు సాయిబాబ, తెలుగు రైతురాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి , ఉలిగయ్య, పల్లిపాడురామిరెడ్డి, ముత్తురెడ్డి, బసలదొడ్డి ఈరన్నలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాజారెడ్డి, టీబీ డ్యాం బోర్డు చైర్మెన్ టిప్పు సుల్తాన్, సురేష్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, వరదరాజు, వెంకటపతిరాజు,అయ్యన్న, ఎస్ఎం గోపాల్‌రెడ్డి, అశోకరెడ్డి, మద్దిలేటి, వీరేష్ గౌడు, మల్లికార్జున, అడివప్పగౌడు, నర్సరెడ్డి, అంజినేయులు, వెంకటపతిరాజు, జమీర్, రామకృష్ణ, కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల నుంచి పెద్ద నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

రీసర్వేలో సమస్యలకు పరిష్కారం చూపాలి



సుంకేశ్వరిలో సమస్యలపై సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

మంత్రాలయం, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో కొలతల నిర్ధారణ, సాగు చేస్తున్న భూముల సరిహద్దులు, కంప్యూటర్‌లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించి పలు విషయాలను సర్వే అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన రైతుల ఫిర్యాదులను పరిశీలించి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రవి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు ఆనంద్, నరసప్ప, సర్వేయర్లు తిమ్మేష్, భీరప్ప, నవీన్ కుమార్, చంద్ర నాయక్, భవ్య, శోభారాణి పాల్గొన్నారు.

● **పెద్దకడబూరు**

మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో జరిగే రీసర్వేను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ మంగళవారం పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చిన్నతుంబళంలో సర్వేయర్లు, వీఆర్వోలు చేపడుతున్న రీసర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. భూములను సర్వే చేసే సమయంలో సమాచారాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీ సర్వే డీటీ లలిత కుమారి, ఆర్ఐ జర్మియ, సర్వేయర్ అళ్లప్ప, వీఆర్వోలు పాల్గొన్నారు.

కేంద్రానికి గుణపాఠం చెప్పాలి : సీఐటీయూ

ఎమ్మిగనూరు రూరల్, మే20(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సీఐటీయూ తాలుకా అధ్యక్షులు వీరేష్, ఉపాధ్యక్షులు అమాలి వీరేష్ అన్నారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను అభద్రతాభావంలోకి నెట్టిందన్నారు. కార్యక్రమంలో నరసింహులు, వెంకటేష్, నాగేంద్ర, షరీఫ్, ఇస్మాయిల్, గోపాల్, హరి, నరసప్ప, సమీఉల్లా, రాజీవ్‌లు పాల్గొన్నారు.

మఠం ఉద్యోగి మృతి.. పలువురి సంతాపం



నరసింహాచార్ (ఫైల్)

మంత్రాలయం, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో పరిచారకులుగా మంచాలమ్మ దేవాలయంలో పని చేస్తున్న కౌతాళం నరసింహాచార్ (56) అకస్మికంగా మృతి చెందాడు. మంగళవారం ఉదయం అస్వస్థతకు గురి కావడంతో హుటాహుటిన ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు కానీ బెంగుళూరుకు కానీ తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించడంతో బెంగుళూరు వెళ్తుండగా.. గుత్తి సమీపాన మార్గమధ్యలో మృతి చెందాడు. ఈయనకు భార్య లక్ష్మి, ఒక కూతురు ఉన్నారు. ఈయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మఠం విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసురెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, జనసేన ఇన్‌చార్జి బి.లక్ష్మన్నలతో పాటు మఠం ఎంప్లాయిస్ అసోసియేషన్ సిబ్బంది సంతాపం తెలిపారు.

కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుబాల గ్రామంలో కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రాజు డిమాండ్ చేశారు. మంగళవారం డీపీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన టీచర్ షడ్రక్ నీరు పారే కాలువను మట్టితో పూడ్చడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు తెలిపినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాలువను పూడ్చిన షడ్రక్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 100 పడకల ఆసుపత్రి ప్రారంభ ఏర్పాట్లను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ప్రారంభోత్సవంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.వీ జయనాగేశ్వరరెడ్డి, కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ వో అధికారులు పాల్గొంటారని సమాచారం.

ఆంజనేయ స్వామి జయంతికి ముస్తాబవుతున్న ఆలయాలు

గోనెగండ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం అంజనేయస్వామి జయంతి వేడుకలకు అంజనేయ, సీతారామ దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. ప్రత్యేక రంగులతో దేవాలయాలను అలంకరిస్తున్నారు. స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించేందుకు భక్తులు సిద్దమవుతున్నారు. అంజనేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అంజనేయ దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మిగిలిన రెండు పరీక్షలు రాసిన చిన్నారి

- పరీక్షలు రాయకుండా వలస వెళ్లిన విద్యార్థిని
- నాలుగు పరీక్షలు రాసి అన్నింటిలో ఉత్తీర్ణత

కోసిగి, మే 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయాల్సిన విద్యార్థి సన్నక్కి చిన్నారి తల్లిదండ్రులతో పాటు గుంటూరు మిర్చి కోతలో వలస వెళ్లింది. పదో తరగతి పరీక్షలు ప్రారంభమైనా వలస కూలీగా పని చేస్తుండటాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రికలో మార్చి 19న పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి పొలంలో ప్రచురితం కావడంతో.. ఈ కథనానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి గుంటూరు, కర్నూలు జిల్లాల కలెక్టర్లు విద్యార్థిని చిన్నారి పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నారు. మూడో పరీక్ష నుంచి రెండు పరీక్షలు మినహా మొత్తం నాలుగు పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించింది. అయితే మిగిలిన రెండు పరీక్షలు తెలుగు, హిందీ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభం కావడంతో తెలుగు సోమవారం, హిందీ మంగళవారం పరీక్షరాసి పూర్తి చేసింది. ఫ్లయింగ్ స్క్వాడ్ శోభరాణి విద్యాధికారులు చిన్నారినీ అభినందించారు. ఆంధ్రజ్యోతి కథనం ద్వారానే పరీక్షలు రాశాననీ, ఇక చదువు ముగిసిపోయిందనుకున్న తనకు ఆంధ్రజ్యోతి తన జీవితంలో వెలుగు నింపిందని చిన్నారి తెలిపింది. మంచి మార్కులతో పాసై ఉన్నత చదువులు కూడా చదువుకుంటానని ఆ బాలిక తెలిపింది.

హక్కుల పరిరక్షణకై నిరంతరం పోరాడాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కుల పరిరక్షణకై నిరంతరం పోరాడాలని సీఐటీయూ మండల అధ్యక్షులు గోవిందు, కార్యదర్శి రాముడు ,అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవర్ధనమ్మ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ప్రసాద్ ,అనీఫ్,కేఎంస్ జిల్లా నాయకులు ఎస్ రాజు,సత్యన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బైక్ చోరీ : కేసు నమోదు

ఎమ్మిగనూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర పెట్టిన బైక్ చోరీ అయ్యింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదోనికి చెందిన వై. నాగరాజు ఆర్‌టీసీ బస్టాండ్ బయట సూపర్ స్పెండర్ ఎపి 02 ఎఆర్ 6125 బైక్ పెట్టి లోపలికి వెళ్లి వచ్చి చూసే సరికి లేకపోవడంతో నాగరాజు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వెండి గజ వాహనంపై ప్రహ్లాదరాయలు



రజిత గజవాహనం విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై విహరించారు. వైశాఖమాస సప్తమి మంగళవారం శుభదినంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మంత్రాలయంలో శంకర నారాయణ మఠం పీఠాధిపతి శంకరతీర్థ స్వామీజీ

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తమిళనాడు లోని తిరుహూరు శంకర నారాయణ మఠం పీఠాధిపతి శ్రీ శంకర తీర్థస్వామీజీ మంగళవారం రాత్రి మంత్రాలయంకు వచ్చారు. స్వామిజీకీ ఆలయ మహా ముఖద్వారం వద్ద శ్రీ మఠం ఏఏఓ మాధవశెట్టి, ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వాదిరాజ ఆచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్, అనంతపురాణిక్, వాజీంద్ర ఆచార్ లు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్నాటక హైకోర్టు జడ్జీ

మంత్రాలయం, మే 20(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాస హరీష్ కుమార్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు.

ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి

పెద్దకడబూరు, 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలని రైతు సంఘం డివిజన్ కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం కార్యవర్గ సభ్యులు పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని బస్టాండ్ ఆవరణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. రైతులకు రూ.2లక్షల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. గతంలో పెద్దకడబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నేటి వరకు కరువు రుణం ఇవ్వలేదన్నారు. వేరుశనగ విత్తనాలు, పత్తి విత్తనాలు సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హనుమంతు, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివ సర్కిల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని వ్యక్తి శివ సర్కిల్‌లో వాంతులు చేసుకొని అస్వస్థత గురై స్పృహ కొల్పోయి పడిపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. అచూకి తెలిసిన వారు పోలీసులకు తెలపాలని కోరారు.

మంత్రి పర్యటన రద్దు

ఎమ్మిగనూరు, మే20(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి నేడు ఎమ్మిగనూరుకు రావాల్సిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన రద్దయ్యింది. ఆస్పత్రి ప్రారంభోత్సవానికి బీవీ జయనాగేశ్వరరెడ్డి మంత్రిని ఆహ్వానించారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల మంత్రి తన ఎమ్మిగనూరు పర్యటనను రద్దయినట్లు తెలిసింది. అయితే ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం యథావిధిగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆస్పత్రి వైద్యులతో పాటు సిబ్బంది, టీడీపీ శ్రేణులు హాజరు కావాలని టీడీపీ కార్యాలయ వర్గాలు కోరాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గోనెగండ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్ల గ్రామ శివార్లలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయలయ్యాయి. అయ్యకొండ గ్రామానికి చెందిన రంగస్వామి అనే వ్యక్తి తన గ్రామం నుంచి గోనెగండ్లకు తన ద్విచక్రవాహనంలో గోనెగండ్లకు వస్తుండగా అదే సమయంలో గోనెగండ్ల నుంచి గంజహళ్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనం పై గంజహళ్లి కి బయలు దేరారు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో రంగస్వామి అనే వ్యక్తికి తీవ్రగాయాలు కాగా గంజహళ్లికి చెందిన ఇద్దరి వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. రంగస్వామిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే



కార్యాలయం ఎదుట బైఠాయించిన సీఐటీయూ నాయకులు

మంత్రాలయం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ల అమలును వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు జయరాజు, ఏఐటీయూసీ నాయకులు భాస్కర్ యాదవ్‌లు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భీమేశ్వరి, వీరేష్, ఆంద్రయ్య, అంజి, ప్రాణేష్, ఏఐవైఎఫ్ నాయకులు రాజు, సీపీఐ నాయకులు గాబ్రియేలు, లక్ష్మన్న, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

గోనెగండ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): దోమలు, ఈగలు ప్రబలకుండా ఉండేందుకు గాను వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆదోని డివిజనల్ మలేరియా అధికారి సాయిబాబా తెలిపారు. అందులో బాగంగా మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాల, బీసీ బాలికల హస్టల్‌ల్లో దోమలు, ఈగలు ప్రబల కుండా వాటి గుడ్లు లేకుండా చేసేందుకు గాను మండల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మలేరియా అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో ఈగలు, దోమలు మందును పిచికారి చేశారు. కార్యక్రమంలో మండల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ అందకపోవడంతో ఆందోళన

ఎమ్మిగనూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలోని పలు వార్డులలోని లబ్ధిదారులకు మే నెల రేషన్ అందకపోవడంతో ప్రజలు ఆందోళనకు దిగారు .ఈ నెల 3, 5వ తేదీన 5 రేషన్ షాపులపై కేసుల నమోదు కావడంతో ప్రస్తుతం అ వారుక్డు సంబందించిన నిత్యవసర సరుకులు పంపిణి జరగకపోవడంతో కార్డు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు.రేషన్ సరుకులను ఇన్చార్జిలకు అప్పగించి వారి ద్వారా పంపిణీ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉంది. కానీ 5వార్డులకు చెందిన రేషన్ షాపుల నుంచి మే నెలకు సంబందించిన రేషన్ సరుకులు అందించలేకపోయారు. రెవెన్యూ అధికారులు మేల్కొని ప్రజలకు అందాల్సిన రేషన్ అందేలా చూడాలని కోరుతున్నారు.

14వ రోజుకుమునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె



సమ్మె చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు .రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 14వ రోజు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో రాజేంద్ర,నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.